క్లుప్తంగా

వంతెన నిర్మాణం చేపట్టాలని ధర్నా

బోథ్: బోథ్‌ను ఆనుకుని ఉన్న కంద్రె వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పాత వంతెన వద్ద ధర్నాకు దిగారు. వర్షాకాలంలోపు నిర్మాణం చేయకపోతే 20 గ్రామాల ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ట భూమేశ్, ఓబీసీ నియోజకవర్గ ఇన్‌చార్జి తూము సూర్యం, శ్రీకాంత్, ముత్యం, అఖిలేష్, శంకర్, హరీష్, గంగయ్య, ప్రవీణ్, ఆడెల్లు, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగుల బస్‌పాస్ మేళా

తాంసి: భీంపూర్ మండలంలోని కరంజి(టి) గ్రామంలో సోమవారం ప్రత్యేక మొబైల్ వాహనంలో దివ్యాంగుల బస్‌పాస్ కౌంటర్ ఏర్పాటు చేశారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్‌పాస్ కౌంటర్ ద్వారా మండలంలో సదరం సర్టిఫికెట్ కలిగిన పలువురికి బస్‌పాస్‌లు అందజేశారు. 18 మంది దివ్యాంగులకు రాయితీ బస్‌పాస్‌లు అందించినట్లు బస్‌పాస్ సెంటర్ ఇన్‌చార్జి సయ్యద్ అహ్మద్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్ జయంతి

ఇంద్రవెల్లి: మండలంలోని న్యూహీరాపూర్ గ్రామంలో సోమవారం అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సిందే సుభాష్, విక్రమ్, కిశోర్, మాధవ్ పాల్గొన్నారు.

అన్ని వార్డులకు సమ ప్రాధాన్యత

కైలాస్‌నగర్: అభివృద్ధి పరంగా పట్టణంలోని అన్ని వార్డులకు సమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. స్థానిక సంజయ్‌నగర్ కాలనీలో రూ.30లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. పట్టణ ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించాలనే ఉద్దేశంతో కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఆయన వెంట సానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యలను విస్మరిస్తున్న ప్రభుత్వాలు'

ఎదులాపురం: ప్రజా సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని ఆదిలాబాద్ సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. ఇంటింటికీ సీపీఐ కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు, వ్యక్తులకు కొమ్ము కాస్తుందన్నారు. కార్మికుల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు ముడుపు నళిని రెడ్డి, అరుణ్ కుమార్, కుంటాల రాములు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంకు లేఖలు రాసిన కార్యదర్శులు

బోథ్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని కోరుతూ బోథ్ మండల పంచాయతీ కార్యదర్శులు సీఎం కేసీఆర్‌కు సోమవారం లేఖలు రాశారు. ప్రొబేషనరీ కాలం ముగిసినా.. తమను రెగ్యులర్ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. అనంతరం బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు.

ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ఇంద్రవెల్లి: జనశిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా అందిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరెంగా గాంధారి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభించిన ప్రధానమంత్రి కౌశల్ యోజన ఉచిత బ్యూటిషన్, టైలరింగ్ శిక్షణను ప్రారంభించారు. కార్యక్రమంలో జనశిక్షణ సంస్థ డైరెక్టర్ శ్యామల, ఎంపీటీసీ ఆశ, ప్రోగ్రాం ఆఫీసర్ రాజన్న, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ సంతోశ్, సత్యానంద్, తదితరులు పాల్గొన్నారు.

తగ్గుతున్న కోవిడ్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో గడిచిన వారం, పది రోజుల్లో కోవిడ్ కేసులు పెరగగా, ప్రస్తుతం తగ్గుముఖం పడుతున్నాయి. సోమవారం 30 మందికి పరీక్షలు చేయగా అందరికీ నెగిటివ్‌గా తేలింది. జిల్లాలో ప్ర స్తుతం ఒక యాక్టీవ్ కేసు మాత్రమే ఉండగా హోం ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారు.

ఎండ... వానా

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లాలో భిన్నమైన వాతావరణం నెలకొంది. ఉదయం ఎండ దంచికొట్టగా మధ్యాహ్నం పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. కొన్ని చోట్ల చిరుజల్లులు పలుకరించగా మరి కొన్ని ప్రాంతాల్లో మోస్తారు వర్షం పడింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఉదయం నుంచి ఉక్కపోతతో అల్లాడిపోయిన ప్రజానీకానికి తాత్కాలికంగా ఉపశమనం లభించినట్లైంది.

ఇంటి వద్దనే జొన్న పంట

- కొనుగోళ్లపై స్పష్టత ఇవ్వని సర్కారు
- పేరుకుపోయిన నిల్వలు
- ప్రభుత్వ మద్దతు ధర రూ. 2970
- బహిరంగ మార్కెట్‌లో రూ. 2 వేల లోపే



ఇంటి వద్ద నిల్వ చేసిన జొన్న పంట



ఈరైతు పేరు లడేవార్ సాయినాథ్. బోథ్ మండలంలోని మర్లపెల్లి గ్రామం. మూడు ఎకరాలను కౌలుకు తీసుకుని జొన్న పంట వేశాడు. మూడు ఎకరాల్లో దాదాపు రూ. 20 వేలు పెట్టుబడి పెట్టాడు. 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పంటను అమ్ముదామంటే ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ప్రారంభించలేదు. ప్రస్తుతం ఇంట్లోనే పంట నిల్వ ఉంది.

బోథ్: ఆరుకాలం కష్టపడి రైతులు పండించిన జొన్న పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికి వచ్చి, ఇంటి వద్దనే నిల్వ ఉంచుకున్నారు. అయినా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదు. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. జిల్లాలో 33,955 ఎకరాల్లో రైతులు జొన్న పంట సాగు చేశారు. ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని రైతులు భావించారు. తీరా చూస్తే జొన్నపంట కొనుగోలుపై నీలి నీడలు కమ్ముకున్నాయి.

మార్కెట్‌లో లేని మద్దతు ధర..

జొన్న పంటకు ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కేవలం రూ. 1500ల నుంచి రూ. 2000లు మాత్రమే పలుకుతోంది. దళారులు, ప్రైవేట్ వ్యాపారులు గ్రామాల్లోకి వెళ్లి రైతుల వద్ద నుంచి జొన్న పంటలను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ. 2970 ఉండగా.. ప్రయివేట్ వ్యాపారులు మాత్రం కేవలం రూ. 1500ల నుంచి రూ. 2000ల ధరకే కొనుగోలు చేస్తున్నారు. దీంతో క్వింటాలుకు దాదాపు రూ.900ల నుంచి 1400ల వరకు నష్టపోతున్నారు. సాధారణంగా ఎకరాలకు 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. కొనుగోలు కేంద్రాలు లేకపోవడందో ప్రస్తుతం రైతులు పంటను ఎక్కడ అమ్ముకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



జొన్న పంటను ప్రభుత్వమే మద్దతు ధర రూ. 2970తో కొనుగోలు చేయాలి. బహిరంగ మార్కెట్‌లో ధర లేదు. కొనుగోలు చేయకుంటే రైతులు తీవ్రంగా నష్టపోతారు. ఇప్పటికే దిగుబడి తగ్గిపోయింది. ఎకరానికి 15 క్వింటాలు రావాల్సింది, కేవలం 10 క్వింటాలు మాత్రమే వచ్చింది.

– రామెల్లి భోజన్న, మర్లపెల్లి

ప్రభుత్వం ఆదేశిస్తే కొనుగోలు చేస్తాం

జొన్న కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం లేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే కొనుగోళ్లు చేపడుతాం. ప్రస్తుతానికి జొన్న కొనుగోళ్లు జరగడం లేదు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు.

– గౌరీ నాగేశ్వర్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్

విద్యార్థుల్లో సంబురం

- నేటి నుంచి వేసవి సెలవులు
- నెలన్నర పాటు ఆటపాటలే



సెలవులు వచ్చిన ఆనందంలో విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: వేసవి సెలవులు ప్రకటించడంతో విద్యార్థుల ఆనందానికి హద్దులు లేకుండా పోయింది. హోం వర్కులు, ట్యూషన్లు, పరీక్షలతో సతమతమైన విద్యార్థులు ఆహ్లాదాన్ని పొందనున్నారు. సోమవారం పాఠశాలకు చివరి రోజు కావడంతో సంతోషంతో ఇంటికి పరుగులు తీశారు. ఇటీవల నిర్వహించిన వార్షిక పరీక్షల ఫలితాలను ప్రకటించారు. విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. ఈనెల 25 నుంచి జూన్ 11 వరకు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. గురుకులాలు, వసతిగృహాల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థులు ఇంటిముఖం పట్టారు. విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు పాఠశాలకు వచ్చి వారిని తీసుకెళ్లారు. దీంతో బస్టాండ్ ప్రాంతం విద్యార్థులతో కిక్కిరిసిపోయింది.

ముగిసిన సప్తాహం

బేల: మండలంలోని బెదోడ గ్రామంలో వారం రోజులుగా కొనసాగుతున్న బాజీరావు బాబా సప్తాహ సోమవారం ముగిసింది. స్థానిక ప్రధాన వీధుగా గుండా భజన, కీర్తనల మధ్య న పల్లకీని ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో ప్రధాన శిష్య బృందం భక్తులను ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధించారు. కార్యక్రమంలో సర్పంచ్ అర్చన, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్షయగ్రస్తులు చికిత్స తీసుకోవాలి

తాంసి: క్షయగ్రస్తులు తప్పనిసరిగా చికిత్స తీసుకోవాలని భీంపూర్ ఆరోగ్య కేంద్రం హెచ్ఈవో జ్ఞానేశ్వర్ అన్నారు. సోమవారం మండలంలోని లింగూడలో క్షయపై వైద్య సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. క్షయగ్రస్తుల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గంగాధర్, ఏఎన్ఎం సరస్వతి, శకుంతల పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం

నేరడిగొండ: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందుతుందని నేరడిగొండ పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ సద్దాం, రాథోడ్ రాజులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 19 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. 14 మందికి న్యూట్రిషన్ కిట్లు అందజేశారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సూచించారు.

సేవ కార్యక్రమాల్లో ముందుండాలి

జైనథ్: యువత సేవ కార్యక్రమాల్లో ముందుండాలని దీపాయిగూడ సర్పంచ్ బొల్లి గంగన్న అన్నారు. సోమవారం గ్రామంలోని కృషి యువజన సంఘం సభ్యులతో ప్రాథమిక పాఠశాలకు రూ. 15 వేల విలువ చేసే బీరువా అందజేశారు. హెచ్ఎం రాంచందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాకేశ్‌రెడ్డి, కోండూరు సాయి, కోంద్ర వంశీ పాల్గొన్నారు.

కంటివెలుగు ప్రారంభం

బోథ్: మండలంలోని పిప్పల్‌ధరి గ్రామంలో సోమవారం కంటివెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ తుల శ్రీనివాస్, సర్పంచ్ శ్రీధర్‌రెడ్డిలు ప్రారంభించారు. ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిపాల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వం చేపట్టిన కంటివెలుగు మండలంలో కొనసాగుతోంది. సోమవారం దంతన్‌పల్లి గ్రామంలో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కంటి పరీక్షలు చేసి కళ్లద్దాలు అందజేశారు.

సచిన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

ఆదిలాబాద్: క్రికెటర్ సచిన్ టెండూల్కర్‌ను క్రీడాకారులు ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ క్రికెటర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని జేసీ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం సచిన్ టెండూల్కర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలనునారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి దేవేంద్ర పాటస్కర్, ఫారూఖ్ జయేంద్ర పాటస్కర్, రాజేశ్ మిట్టల్, కిషోర్ పాల్గొన్నారు.

ఈరోజు..

ఆరోగ్య అవగాహన సదస్సు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మారెడ్డి, కిష్టయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ క్రాంతికుమార్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కైలాస్‌నగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని సంజయ్‌నగర్ కాలనీలో ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని టౌన్- 3 ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

బీఆర్ఎస్ ప్లీనరీ సమావేశం

బోథ్: బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా మంగళవారం బోథ్ నియోజకవర్గ కేంద్రంలోని పొచ్చర క్రాస్ రోడ్డు వద్ద సాయిఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ ప్లీనరీ సమావేశం నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు సోమవారం సమావేశ స్థలాన్ని పరిశీలించారు. 3,500 మందితో సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

సరుకుల పంపిణీ

బోథ్: మండలంలోని హరిజనవాడలో నిరుపేద కుటుంబాలకు గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త మీర్ ఇర్షాద్ అలీ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నల్ల గంగయ్య, లింగంపల్లి ప్రకాష్, విజయ్, నవీన్, మధు, లక్ష్మణ్, మహేందర్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

బోథ్: మండలంలోని గుర్రాలతండా గ్రామానికి చెందిన అనాథ యువతికి పెళ్లి నిశ్చయం కావడంతో ఎంపీపీ తుల శ్రీనివాస్ గ్రామానికి వెళ్లి రూ. 15 వేల ఆర్థిక సాయం సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, మనీందర్ సింగ్, గ్రామ పెద్దలు ఉన్నారు.

నార్నూర్: మండలంలోని నాగలకొండ గ్రామానికి చెందిన పేదింటి అమ్మాయి పెళ్లికి శ్రీసంత్ సేవ సమితి ఆధ్వర్యంలో రూ. 5 వేల ఆర్థిక సాయం సోమవారం అందించినట్లు సమితి అధ్యక్షుడు రాథోడ్ సందీప్ తెలిపారు. కార్యక్రమంలో సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

బేల: మండలంలోని వరూర్ గ్రామానికి చెందిన ఆత్రం రాందాస్ నిరుపేద ఆదివాసీ కుటుంబానికి సోమవారం పాయల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు పోత్రాజ్ నవీన్, కడకుంట్ల కృష్ణ, రాకేశ్, కృష, సంతోశ్ పాల్గొన్నారు.

కోర్టు ఉత్తర్వుల ప్రకారమే అక్రమణల తొలగింపు

బేల: మండల కేంద్రం పరిధిలోని ఏజెన్సీ ప్రాంతమైన బురాన్‌పూర్ శివారులో కోర్టు ఉత్తర్వుల మేరకు అక్రమణ తొలగింపు చర్యలు తీసుకున్నామని పంచాయతీ పంచాయతీ కార్యదర్శి సురేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సోమవారం సమనుజ్ఞ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన ప్రారంభించారు. ప్రముఖ న్యాయవాది విశ్వనాథ్, అకౌంటెంట్ మోహన్, సు ధాకర్ తిరుపతిరెడ్డి, నిర్భయ్ కుమార్, తారాబాయి పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీవోఏల సమ్మె

ఇంద్రవెల్లి: ఉద్యోగ భద్రత, పనికి సమానంగా వేతనం ఇవ్వాలని ఐకేపీ వీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. సోమవారం ఏడో రోజు వీవోఏలు మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఐకేపీ వీవోఏల మండల అధ్యక్షుడు షేక్ ఫెరోజ్, ఉపాధ్యక్షుడు కోట్నాక్ భారిక్‌రావ్, రంగుల రాజమణి, కారం రాజేశ్వర్, మడావి జల్‌దేవి, జైపాల్, మహేశ్ పాల్గొన్నారు.

నేరడిగొండ: ఐకేపీ వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ అన్నారు. వారం రోజులుగా ఐకేపీ వీవోఏలు చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపారు.

తాంసి: సమస్యలు పరిష్కరించాలని వీవోఏలు చేపడుతున్న నిరవధిక సమ్మె సోమవారం ఎనిమిదోవ రోజుకు చేరుకుంది. భీంపూర్ మండల కేంద్రంలో వీవోఏలు ఒంటికాలుపై నిలబడి వినూత్న నిరసన తెలిపారు. రత్నమాల, ప్రమోద్, గోవింద్‌రావు, సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

బోథ్: మండలంలోని దన్నూర్ గ్రామానికి చెందిన సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ ఎంపీ నగేశ్ సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

నేరడిగొండ: మండలంలోని బుద్దికొండ గ్రామానికి చెందిన అన్‌రెడ్డి లింగారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబసభ్యులను మాజీ ఎంపీ గోడం నగేశ్ పరామర్శించారు.

బీఆర్ఎస్ సభ ఏర్పాట్ల పరిశీలన



పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్ఎస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ప్రతినిధుల మహాసభ ఏర్పాట్లను ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న పరిశీలించారు. పట్టణంలోని గాయత్రి గార్డెన్‌లో మంగళవారం సభ నిర్వహించనున్నారు. సభకు సంబంధించిన వివరాలను బీఆర్ఎస్ నాయకుడు జోగు మహేందర్ ఎమ్మెల్యేకు వివరించారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వెంట డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మెట్టు ప్రహ్లాద్, ప్రశాంత్ వాగ్మారే పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. పనులు పూర్తయ్యేదెప్పుడో?



నేరడిగొండ: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చడానికి అదనపు గదుల నిర్మాణం చేపట్టారు. పనులు పూర్తయి ఆదాయం వస్తున్నప్పటికీ పైన మాత్రం నిర్మాణం చేపట్టకుండా అసంపూర్తిగా వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గదుల నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

– సంబంధిత అధికారి: రాఘవ, పంచాయతీ కార్యదర్శి, నేరడిగొండ, ఫోన్: 85558 44001

రేవంత్‌రెడ్డి సభకు తరలిరండి



మాట్లాడుతున్న బ్లాక్ కాంగ్రెస్ కమిటీ నాయకులు

నేరడిగొండ: రేవంత్‌రెడ్డి సభకు తరలిరావాలని బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ప్రఫుల్ చందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఈనెల 26న ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువత తరఫున పోరాడేందుకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో నిరుద్యోగ సమర భేరి ర్యాలీ, కార్నర్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీ పరీక్షలు ప్రశ్న పత్రాలను బీఆర్ఎస్ నాయకులు లీక్ చేశారని ఆరోపించారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మండల అధ్యక్షుడు ఆడే వసంత్ రావ్, నియోజకవర్గ అధికార ప్రతినిధి ఎండీ సద్దాం, ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



బోథ్: మాట్లాడుతున్న సీఐ కిరణ్ కుమార్

బోథ్: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని బోథ్ సీఐ కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని పట్నాపూర్‌లో ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా సోమవారం సైబర్ క్రైం, మోటార్ వెహికిల్ చట్టాలు, దళారీ వ్యవస్థ నిర్మూలన, గంజాయి, గుడుంబా, నేరాలు, దొంగతనాలు వంటి గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పంద్రం సుగుణ, న్యాయవాది శంకర్, మాజీ ఎంపీపీ అప్క కిషన్, ప్రధానోపాధ్యాయులు గొడం చందన్, సోనేరావ్, నీలకాంత్ రావు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని షీటీం ఇన్‌చార్జి సునీత అన్నారు. సోమవారం మండలంలోని పొచ్చర గ్రామంలో సఖీ కేంద్రం ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మానవ అక్రమరవాణా, ఫోక్సోయాక్ట్ చట్టాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా ఆకతాయిలు వేధిస్తే 100కు డయల్ చేయాలన్నారు. అనంతరం కరపత్రాల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి, ఉప సర్పంచ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల బలోపేతమే లక్ష్యం

- బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు



తాంసి: చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బాపురావు

తాంసి: మహిళా సంఘాల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం వద్ద తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాలకు చెందిన ఐకేపీ కస్టమర్ హైరింగ్ సెంటర్లకు చెందిన ట్రాక్టర్లను ప్రారంభించారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాల చెక్కులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ఫలాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లోని రైతులు ఇబ్బంది పడవద్దని ప్రభుత్వం ట్రాక్టర్లను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తాంసి, భీంపూర్ జెడ్పీటీసీలు రాజు, సుధాకర్, ఏపీఎంలు రవీందర్, ప్రసాద్, వైస్ ఎంపీపీ రఘు, మొట్టె కిరణ్, సర్పంచ్ కృష్ణ, శ్రీధర్ రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

వంతెన నిర్మాణాలు వేగవంతం చేయాలి

నేరడిగొండ: ప్రజలకు ఇబ్బంది కలగకుండా వంతెన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. సోమవారం మండలంలోని కుంటాల జలపాతానికి వెళ్లే దారిలో రూ.3.28 కోట్లతో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. రవాణా పరంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ రాథోడ్ సజన్, నారాయణ్ సింగ్, రాథోడ్ కమల్ సింగ్, ఏలేటి రవీందర్ రెడ్డి, జాదవ్ మహేందర్, కరణ్ సింగ్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

మండలంలోని బుద్దికొండ గ్రామానికి చెందిన అన్‌రెడ్డి లింగారెడ్డి ఇటీవల మృతిచెందారు. విషయాన్ని తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు సోమవారం ఆయన నివాసానికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ రాథోడ్ సజన్, నారాయణ్ సింగ్, కమల్ సింగ్, కరణ్‌సింగ్ ఉన్నారు.

అందరికీ 'ఉపాధి' కల్పించాలి



నార్నూర్: పనులు పరిశీలిస్తున్న రాథోడ్ రవీందర్

నార్నూర్: జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని డీఆర్డీవో అదనపు పీడీ రాథోడ్ రవీందర్ అన్నారు. సోమవారం గాదిగూడ మండలంలోని సావురి, పిప్పిరి, గాదిగూడ గ్రామాలలో ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కూలీల హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కూలీల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. హరిత హారంలో భాగంగా నర్సరీలలో మొక్కలు పెంచేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో రామేశ్వర్, ఏపీవో పవర్ నితిన్, ఎఫ్ఏలు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను సోమవారం ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు పరిశీలించారు. కూలీలకు పూర్తిస్థాయిలో పనులు కల్పించాలన్నారు. కూలి డబ్బులు వెంటనే చెల్లించేలా చూడాలన్నారు. ఎండ అధికంగా ఉన్నందున ఉదయం మాత్రమే పనులు చేయాలన్నారు.